ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 09.05.2026 సమయం. 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో తమ ప్రభుత్వం హిందూ, ముస్లీం లను రెండు కళ్లుగా భావిస్తూ మైనారిటీ సంక్షేమానికి కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

2. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపు హైదరాబాద్ పర్యటనకు రానున్నారు. సుమారు 8 వేల కోట్ల రూపాయల విలువ గల అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు.

3. రాష్ట్రంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు గోనే సంచులు కూడా ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే. తారక రామారావు ఆరోపించారు.

4. జనగణనకు సంబంధించి అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా పలు అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

**రేవంత్ రెడ్డి**

తమ ప్రభుత్వం హిందూ ముస్లింలను రెండు కళ్లుగా భావిస్తూ మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హాజ్ యాత్రికుల బస్సును హైదాబాద్ నాంపల్లి హజ్ నుంచి ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ యాత్రికుల విమాన ఇంధన చార్జీల భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రార్థించాలని ఆయన యాత్రికులను కోరారు. ఓటరు జాబితాల సవరణ పేరుతో బీజేపీ

సాగిస్తున్న కుట్రలు రాష్ట్రంలో సాగనివ్వబోమని స్పష్టం చేశారు. మైనార్టీ సంక్షేమ శాఖపై జరిగిన సమీక్ష సమేవేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... మైనార్టీ విద్యార్థుల కోసం ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వీటిలో నైపుణ్యాభివృద్ధి, కృత్రిమ మేధ బోధనకు ప్రాధాన్యం ఇస్తూ ఉపాధి అవకాశాలు పెంచాలని సూచించారు. ఇమామ్ ల గౌరవ వేతనాలను క్రమం తప్పకుండా విడుదల చేయాలని, ఖబరస్థాన్‌లకు భూములు కేటాయించాలని చెప్పారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో భాగంగా అన్ని మతాల ప్రార్థనా మందిరాల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

డెస్క్

**రేవంత్ రెడ్డి**

రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల్లో పెరుగుతున్న జనభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయవలసి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు సచివాలయంలో నిర్వహించిన పార్లమెంటరీ స్థాయి సంఘం సమావేశంలో ఆయన ఆ మేరకు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం తెలంగాణ రైజింగ్ – 2047 మాస్టర్ ప్లాన్ ను ఆవిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. హైదరాబాద్ ను సిగ్నల్ ఫ్రీ సిటిగా తీర్చిదిద్దాలని, అండర్ పాస్, సర్ఫేస్, ఎలివేటెడ్ అనే మూడు స్థాయిల విధానాన్ని తీసుకురావాలని ఆయన సూచించారు. పార్కింగ్ ఇబ్బందులను అధిగమించేందుకు బహుళార్థ పార్కింగ్ విధానాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. హైదరాబాద్ లో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా ఆర్టీసిలో ఈవీ బస్సులను ప్రవేశపెడుతున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. స్థాయి సంగం ఛైర్మన్ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, కేంద్ర, రాష్ట్ర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

డెస్క్

**ప్రధాని హైదరాబాద్ పర్యటన**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు హైదరాబాద్‌లో పర్యస్తారు. నరేంద్రమోదీ మూడవసారి ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారిగా రాష్ట్రానికి వస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నేతృత్వంలో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానమంత్రి తమ పర్యటనలో భాగంగా సుమారు 8 వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు  చేస్తారు. జహీరాబాద్ స్మార్ట్ సిటీ, జాతీయ రహదారి పనులు, ఐఓసీ టెర్మినల్ వంటి కీలక ప్రాజెక్టులు ఇందులో ఉన్నాయి. సాయంత్రం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించే భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో సికింద్రాబాద్ చుట్టూ ఈ రాత్రి 12 గంటల నుంచి నో ఫ్లై జోన్ గా ప్రకటించినట్లు పోలీస్ కమిషనర్ సముతి చెప్పారు. జిల్లాల నుంచి వచ్చే బస్సులకు హైదరాబాద్ ప్రవేశంలోనే పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు.

డెస్క్

**కేటీఆర్**

రాష్ట్రంలో రైతులు తమ ధాన్యం తూకం వేసుకొనేందుకు  లంచాలు ఇవ్వాల్సిన దుస్థితి నెలకొందని, మక్కల కొనుగోళ్లకు ప్రభుత్వం కనీసం గోనె సంచులు సరఫరా చేయడం లేదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. తారక రామారావు ఆరోపించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కి  మత రాజకీయాలు తప్ప తెలుసు తప్ప- ప్రజల, రైతు సంక్షేమంపై  ఏ మాత్రం అవగాహన లేదని  విమర్శించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పార్టీలో త్వరలో కొత్త  కమిటీలు ఏర్పాటు చేస్తామని, వాటిలో యువతకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

పిటిసి, రాజన్న సిరిసిల్ల

**లోయర్ డ్యామ్**

ఆసిఫాబాద్ జిల్లా, నజ్రుల్ నగర్ లో లోయర్ డ్యామ్ మరమ్మత్తులకు ఎమ్మెల్యే కోటా నిధుల నుంచి 50 లక్షల రూపాయలను మంజూరు చేస్తున్నట్లు శాసనసభ్యుడు పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. గ్రామంలో ఈరోజు జరిగిన రైతు వారోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర

ప్రభుత్వ ఖజానా ఖాళీ అయిందని, నిధులు మంజూరు చేసే పరిస్థితి లేదని ఆయన వ్యాఖ్యానించారు.

పిటిసి, ఆసిఫాబాద్

**హరీష్ రావు**

రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, విశ్రాంత ఐపిఎస్ అధికారి భార్య హత్య, కరీంనగర్ లో పట్టపగలు దోపడి వంటి సంఘటనలు ఇందుకు నిదర్శనమని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. నేరస్థులను పట్టుకోవడంలో విఫలమైన ప్రభుత్వం తమ పార్టీ సామాజిక మాధ్యమం ఇంచార్జ్ క్రిశాంక్ వంటి వారిపై అక్రమ కేసులు పెడుతోందని ఆయన విమర్శించారు.

డెస్క్

నిమ్జ్

సంగారెడ్డి జిల్లా, జహీరాబాద్ లో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ (నిమ్జ్) పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, పరిశ్రమల స్థాపనకు వీలుగా మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. నిమ్జ్ పరిధిలోని సేకరించిన భూముల ప్రస్తుత స్థితి, భూముల అభివృద్ధి తదితర అంశాలపై ఉన్నత స్థాయి అధికారులతో ఆయన ఈరోజు సమీక్షించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పీటీసీ, సంగారెడ్డి

**జనగణన లీడ్**

రాష్ట్రంలో ఎల్లుండి నుంచి నిర్వహించే జనగణన ప్రక్రియకు సంబంధించి ప్రజలకు అవగాహన కలిగించేందుకు అధికారులు సమావేశాలు, ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు.

జనగణనలో పాల్గొనడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వానికి ప్రజల సామాజిక ఆర్థిక స్థితిగతులపై అవగాహన ఏర్పడుతుందని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ చెప్పారు. సంబంధిత సిబ్బంది ఇంటింటికి వచ్చే సేకరించే సమాచారంలో

భాగంగా మొత్తం 34 ప్రశ్నలు ఉంటాయని, ప్రజలు ఇచ్చే సమాచారం గోప్యంగా ఉంటుందని విలేకరుల సమావేశంలో చెప్పారు.

పీటీసీ, మహబూబాబాద్

**జనగణన-రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలి నుండి బతుకమ్మ ఘాట్ వరకు ఈరోజు నిర్వహించిన మారథాన్ ను జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ అగర్వాల్ ప్రారంభించారు. సమగ్ర, కచ్చితమైన గణాంకాల రూపకల్పనలో జనగణన కీలకమని, ఈ ప్రక్రియలో అందరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు.

బైట్ ... గరిమా అగర్వాల్

పీటీసీ...రాజన్నసిరిసిల్ల

**జనగణన**

వరంగల్ జిల్లాలో ఎల్లుండి నుంచి ఇంటింటి జనగణన ప్రారంభమవుతుందని ప్రజలు విధిగా తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. ఈరోజు వరంగల్ లో జరిగిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జనగణన స్వయం నమోదు కార్యక్రమం రేపు అర్ధరాత్రితో ముగుస్తుందని తెలిపారు. అనంతరం స్థానిక ఐఎంఎ హాల్ నుంచి పోచమ్మ మైదానం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పిటిసి, వరంగల్

**మైనంపల్లి రోహిత్**

మెదక్ జిల్లాలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలులో జాప్యానికి కారణం ఏమిటని శాసనసభ్యుడు మైనంపల్లి రోహిత్ రావు అధికారులను ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు చేయాలంటే రైతులు ధర్నాలకు దిగడం శోచనీయమని ఆయన అన్నారు. సమస్యకు తక్షణం పరిష్కారం కనుగొనాలని ఆయన సూచించారు. దానికి అదనపు కలెక్టర్ నగేష్ స్పందిస్తూ... నాలుగైదు రోజుల్లో ధాన్యం సేకరణ ప్రక్రియను ముమ్మరం చేస్తామని స్పష్టం చేశారు.

**పిటిసి, మెదక్**

**ధాన్యం కొనుగోలు**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశించారు. ధాన్యాన్ని సకాలంలో తూకం వేసేందుకు సరిపజ హమాలీలను నియమించుకోవాలని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా సరిపడా టార్పాలిన్లు అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు.

పిటిసి, రాజన్న సిరిసిల్ల

**ఇంటర్ పరీక్షలు**

రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియేట్ అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 13 నుంచి 21వ తేదీ వరకు జరుగుతాయని ఇంటర్మీడియేట్ బోర్డ్ కార్యదర్శి అభిలాష్ అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, రెండవ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని వివరించారు. ఈనెల 22, 25 తేదీల్లో ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయని ఆయన తెలిపారు.

ప్రెస్ నోట్

**ఇంటర్ జనగామ**

ఈనెల 13 నుంచి 21వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియేట్ అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ పరీక్షల కోసం జనగామ జిల్లాలో 12 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు.

పిటిసి, జనగామ

**ఇళ్ల సమస్యలు**

నల్లగొండ నగర పాలక సంస్థ పరిధిలో ఇంటి నంబర్లు, సరైన లింక్ డాక్యుమెంట్లు లేని ఇళ్ల సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. నగరం పరిధిలో సుమారు 9 వేల 645 ఇళ్లకు ఇంటి నంబర్లు, లింకు డాక్యుమెంట్లు లేక యజమానులు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తేవడంతో, సమస్య

పరిష్కారానికి వారు అధికారులను ఆదేశించారు. ఆ మేరకు కలెక్టర్ అధికారులతో కలసి నిన్న, ఈరోజు నగరంలోని పానుగల్ సమీపంలోని వడ్డెర వాడ, ఐ టి టవర్ ఎదురుగా సుందరయ్య కాలనీ ప్రాంతాలలో పర్యటించి వివరాలను సేకరించారు.

పీటీసీ, నల్లగొండ

**పనివారి వివరాలు**

ఆసిఫాబాద్ జిల్లాలోని ఇంటి యజమానులు తమ ఇళ్లలో పనిచేసే సహాయకులు, వంట మనుషులు, భద్రతా సిబ్బంది, డ్రైవర్లు, వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

పీటీసీ, ఆసిఫాబాద్